క్లుప్తంగా

అంజన్నకు పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గాండ్లవీధిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అంతకుముందు అర్చకులు మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, అర్చనలు జరిపారు. అలాగే భక్తులందరూ సహస్రనామాలతో ఆకుపూజ చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆలయ అభివృద్ధికి వితరణ

చిట్వేలి : మండల పరిధిలోని కబరాయుడు స్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి గాంధీ నగర్ నివాసి కీ.శే.లు దేరంగుల పెద్దరామయ్య జ్ఞాపకార్థం భార్య చిన్నక్క, కుమారుడు శేఖర్‌లు మంగళవారం రూ. 75 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు కోడలు అనిత, మనువళ్లు యశ్వంత్, తేజేష్‌లు పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి

ఓబులవారిపల్లె : గ్రామీణ ప్రాంతాలలో పరిశుభ్రతను పాటించాలని, ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ముక్కావారిపల్లి, మంగంపేట పంచాయతీలో చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి చెత్త నుంచి సంపద కేంద్రాలలో తడిచెత్త, పొడి చెత్తను సేకరించి గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి గురుమహేష్

ఓబులవారిపల్లె : మారుమూల ప్రాంతాలలో ఉన్న దళితులు, గిరిజనుల పేదలకు వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని అడ్వకేట్ శంకరయ్య పేర్కొన్నారు. మంగళవారం చిన్నఓరంపాడు జడ్‌పిహెచ్‌డీసీ కాలనీలో హైకోర్టు ఉత్తర్వుల మేర రైల్వేకోడూరు సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి జి.విజయలక్ష్మీ ఆదేశంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గురు మహేష్ పేదలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. బాలింతలు, వృద్ధులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సురేష్ రెడ్డి, ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ కొండయ్య, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మైసూరావారిపల్లిలో గ్రామసభ

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని మైసూరావారిపల్లి పంచాయతీలో అధికారులు మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జెడ్పీటీసీ రత్నమ్మలు హాజరయ్యారు. సర్పంచ్ కారుమంచి సంయుక్త ఆధ్వర్యంలో పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 21న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వస్తారని, అన్ని సమస్యలు పరిష్కరించి ఆదర్శ పంచాయతీగా చేస్తానని తెలిపారు. పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చెయ్యేటిపల్లెలో.. ఇసుకాసురులు

- హత్యరాలలో పోలీసు, రెవెన్యూ అధికారులపై దౌర్జన్యకర పరిస్థితులు
- ఇసుక అక్రమరవాణాను కట్టడి చేయలేని దుస్థితిలో అధికార యంత్రాంగం



హత్యరాల నుంచి ఇసుక అక్రమరవాణా చేస్తున్న దృశ్యం

రాజంపేట : రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలో విస్తరించబడిన చెయ్యేరులో ఇసుకను అక్రమంగా తరలించుకునే విషయంలో అధికారులు అడ్డుపడితే తమ్ముళ్లు తిరగబడుతున్న సంఘటనలు రోజురోజుకు ఉధృతమవుతున్నాయి. రెవెన్యూ సిబ్బంది ఇసుక అక్రమ రవాణా కట్టడి చేయాలంటే భయపడిపోతున్నారు. గత కొద్దిరోజులుగా చెయ్యేటి పల్లెలో ఇదే తంతు కొనసాగుతోందని అధికారిక వర్గాలు ఆందోళన చెందుతున్నారు.

తాజాగా మంగళవారం చెయ్యేటి పరివాహక ప్రాంతమైన హత్యరాలలో అధికారులు అడ్డుకుంటే ఇసుకాసురులు లెక్కచేయలేదు. పట్టుకుంటున్న ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించేందుకు సిద్ధమైతే లెక్కచేయలేదు. తమ ట్రాక్టర్లను ఇసుకతో సహా తమ ఇళ్లకు తీసుకెళ్లిన సంఘటన అటు రెవెన్యూ, పోలీసు, ఎస్ఈబీ వర్గాలలో చర్చనీయాంశమైంది. ఇసుక అక్రమ రవాణా కట్టడిచేయలేని దుస్థితిలో..

చెయ్యేరు నదీ పరివాహక ప్రాంతాలైన నారాయణ నెల్లూరు, హత్యరాల, నందలూరు, ఆడపూరు, పాటూరు తదితర ప్రాంతాల్లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుక ట్రాక్టర్ల జోరు ఊపందుకుంది. ఇసుక ఎవరిమటకు వారు తమ తమ స్థాయిలో దోచుకెళుతున్న అధికారులు కట్టడి చేయలేని పరిస్థితులు ఆవిష్కృతమయ్యాయి. కొంతమంది పోలీసులతో సన్నిహితంగా ఉంటూ రాజంపేట, నందలూరులో అధికారపార్టీకి చెందిన ఇసుకాసురులు తమ పనికానిచ్చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టుకుంటే ఫోన్‌కాల్స్..

ఇసుక ట్రాక్టర్ పట్టుకుంటే అధికారపార్టీ నియోజకవర్గ స్థాయి నేతల నుంచి పోలీసులు, అధికారులకు ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. చేసేదేమీలేక వదిలివేస్తున్న సంఘటనలు ఇటీవల అధికమయ్యాయి. ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో అధికారయంత్రాంగం ఉండిపోతోందన్న అపవాదును మూటకట్టుకుంది. ఈ విషయంపై సబ్‌కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇటీవల నారాయణ నెల్లూరులో చెయ్యేరులో నుంచి గడ్డకు రాకుండా దారులలో అడ్డుకట్ట దిశగా చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ ఇసుక అక్రమరవాణా ఆగడం లేదు. రెవిన్యూ, పోలీసు, సెబ్ పోలీసులు నిఘా ఉంచిన, ఫలితం లేకుండా పోతోంది. యథేచ్ఛగా ఇసుకా సురులు రవాణా విషయంలో ఎవరిని లెక్క చేయని పరిస్థితిలో మూడు పువ్వులు ఆరుకాయలుగా దందా కొనసాగుతోంది.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న డా.శైలజ

రాయచోటి (జగదాంబసెంటర్) : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని అన్నమయ్య జిల్లా అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ శైలజ కోరారు. రాయచోటి పట్టణం మహిళా డిగ్రీ కాలేజీలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ పీసీఎస్ఎస్, ఎల్‌డబ్ల్యూఎస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.శైలజ మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది ఎలా వ్యాపించదు ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలను వివరించారు. అలాగే ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకూడదని సమాజంలో కలసిమెలసి జీవించే విధంగా సహకరించాలని ఆమె కోరారు. ఎయిడ్స్ వ్యాధి, సుఖ వ్యాధుల యొక్క వివరాలను తెలియజేశారు. కండోమ్ యొక్క ఉపయోగాలు, ఎయిడ్స్ యాక్ట్ 2017 ఏఆర్‌టీ మందులు ఏపీ ఎస్ఏసీఎస్ యాప్ టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఎలా ఉపయోగించుకోవాలో చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎల్ఏటీఓ స్వాతి, పీసీఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ ఎల్‌డబ్ల్యూఎస్ అల్లావలి, ప్రిన్సిపల్ చెన్నకేశవరెడ్డి, ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్ విశ్వప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రామమోహన్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే స్కూల్ బస్సులపై చర్యలు



మాట్లాడుతున్న సీఐ బాబు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని ప్రైవేటు స్కూల్స్ బస్సులను నిబంధనలకు విరుద్ధంగా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మంగళవారం సీఐ బాబు హెచ్చరించారు. స్థానిక స్టేషన్ ప్రాంగణంలో స్కూల్ బస్సు డ్రైవర్లు, యాజమాన్యాలతో సమావేశమై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యాలు స్కూల్ బస్సులకు అన్ని రికార్డులు సక్రమంగా ఉండాలని చెప్పారు. అలాగే పూర్తిస్థాయి కండీషన్‌లో ఉన్న వాహనాలు వాడడమే కాక అనుభవమున్న డ్రైవర్లు నడపాలన్నారు. నిబంధనలు ఎవరు అతిక్రమించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సబ్సిడీ డ్రిప్‌లను సద్వినియోగం చేసుకోవాలి



డ్రిప్‌ల కోసం దరఖాస్తులు చేయిస్తున్న అధికారులు

సిద్దవటం : ప్రభుత్వం రైతులకు అందిస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్లను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ జిల్లా అనుసంధానాధికారిణి ప్రగతి తెలిపారు. మండలంలోని పెద్దపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలోని శివునిపల్లె, పేరయ్యగారిపల్లె గ్రామాల రైతులకు మంగళవారం ఏపీఎంఐపి వారి ఆధ్వర్యంలో డ్రిప్, స్ప్రింక్లర్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి రైతు డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులకు డ్రిప్ రిజిస్ట్రేషన్ చేయడమే గాకుండా వాటికి సంబంధించిన విషయాలను వివరించారు. 5 ఎకరాల లోపు భూములు ఉన్న రైతులకు 90శాతం, 5 - 10 ఎకరాల భూమి ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీ ద్వారా రైతులకు డ్రిప్‌లను అందజేస్తామన్నారు. ఈ పద్ధతి ద్వారా నీటిని ఆదా చేయడమే కాకుండా నీటిని వేరు వ్యవస్థకు నేరుగా అందించి మొక్క అభివృద్ధికి తోడ్పడవచ్చన్నారు. 7 సంవత్సరాల క్రితం తీసుకున్న రైతులు ఈ పథకానికి అర్హులవుతారని తెలియజేశారు. అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు సేవా కేంద్రం సహాయకులు ప్రేమ్ సిందీప్, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



రామాపురం: విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న అధికారులు



పెనగలూరు: పాఠశాలపై జాతీయ జెండాను ఎగురవేసిన దృశ్యం



చిట్వేలి: నినాదాలు చేస్తూ మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

చిట్వేలి : ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలని పంచాయతీ కార్యదర్శి కేశవరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చెర్లోపల్లిలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ సహకారంతో కేశవరెడ్డి హర్ ఘర్ తిరంగా (ప్రతి ఇంటిపైన జాతీయ పతాకం) కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎల్లవేళలా గౌరవించాలని సూచించారు.

పెనగలూరు : ప్రతి విద్యార్థి తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో హైస్కూల్ భవనంపై మూడు రంగుల జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్, ప్రమీల, శ్రీవాణి, సుదర్శన్, మహేంద్ర, శివ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : కేంద్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర, గౌతమ్ ప్రైవేట్ పాఠశాలలతోపాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి జాతీయ జెండాను మూడు రోడ్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రామ సచివాలయల పరిధిలోని కార్యదర్శులు పాఠశాలల విద్యార్థులచే హర్‌ఘర్ తిరంగా ఉత్సవాలు నిర్వహించి మిఠాయిలను పంచిపెట్టారు.

చిట్వేలి : మన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడమే నిజమైన దేశభక్తి అని ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రాజెక్టు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త విధి నిర్వహణలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆగస్టు 15న ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించాలని సూచించారు. అనంతరం వెలుగు కార్యాలయం నుండి పాతబస్టాండ్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లి : ఈనెల 15వ తేదీన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి చక్రే నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే స్థానిక మూడు రోడ్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ జెండాతో ప్రతి ఒక్కరూ సెల్ఫీ ఫొటో దిగాలన్నారు. జాతీయ జెండాను ఎగురవేసి ఆత్మస్థైర్యాన్ని నింపుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ గురుప్రసాద్, బ్లాక్ కో-ఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, ఏపీఎం నిరంజన్, వ్యవసాయ అధికారి రమేష్ బాబు, దేవలంపల్లి వైద్యులు సిద్ధయ్య, నజియా బేగమ్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజంపేట రూరల్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా 100 అడుగుల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. దేశం కోసం బలిదానం అయిన వారిని స్మరించుకుంటూ ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. ఈ ర్యాలీలో బీజేపీ నాయకులు పి.ఆదినారాయణ, ఎ.గుణవర్మ, ఈ. పాపయ్య, పి.సూర్యచంద్ర, పి. నవీన్‌కుమార్, హిమగిరి యాదవ్, బీవీ రమణ, జీకే నాగరాజు, పి.రమణ, కె.శ్రీనివాసులు, బి. రెడ్డెయ్య, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఎస్.అబ్దుల్లా, ఎస్. నరసింహరాజు, వీహెచ్‌పీ, ఏబీవీపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ మహబూబ్‌చాంద్ ఆధ్వర్యంలో కూడా భారీ ర్యాలీ నిర్వహించారు.

స్వాతంత్ర్య పోరాటాలపై లఘు చిత్రప్రదర్శన



లఘుచిత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ బయారెడ్డి

రాయచోటి టౌన్ : భారత దేశ స్వాతంత్ర్యం సాధించిన 1947 నాటి సంఘటనలు, దేశ విభజ సంఘటనలపై లఘు చిత్ర ప్రదర్శనను లీడ్ బ్యాంక్ జి.ఆంజనేయుల రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని స్టేట్ బ్యాంక్ సమీపంలో ప్రత్యేక స్క్రీన్‌పై ఆ నాడు జరిగిన సంఘటనలపై నేటి సమాజంలోని ప్రజలకు తెలియచేసేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ బయారెడ్డి తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, నాయకులు తమ మానప్రాణాలను కోల్పోయారని చెప్పారు. వారి త్యాగఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పారు. అలాగే దేశం నుంచి పాకిస్తాన్ విడిపోవడానికి గల కారణాలను వివరించారు. ఈ లఘుచిత్ర ప్రదర్శన ఆగస్టు 15వ తేదీ సాయంత్రం వరకు ఇక్కడే ప్రదర్శిస్తూనే ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ జగదీష్, సుంకేశుల వన్నూర్ బాషా, పూన సుబ్బరామయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ రహదారి విస్తరణకు సర్వే



రహదారి మ్యాప్‌ను పరిశీలిస్తున్న రేంజర్ కళావతి, రెవెన్యూ ఉద్యోగులు

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి కోనకు వెళ్లే రహదారి విస్తరణకు మంగళవారం ఫారెస్టు, రెవెన్యూ శాఖ అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించినట్టు రేంజర్ కళావతి తెలిపారు. ఈ సందర్భంగా వారు రహదారికి సంబంధించి మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం రేంజర్ కళావతి మాట్లాడుతూ జిల్లా అటవీశాఖ అధికారి సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు నిత్యపూజ స్వామి కోనకు వెళ్లే అటవీ ప్రాంతంలో రహదారి విస్తరణకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. తరువాత నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొండారెడ్డి, డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, వీఆర్‌ఓ శాంబాబు, సర్వేయర్ పురుషోత్తం, దేవాదాయ శాఖ ఉద్యోగి చంద్ర, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల సమగ్ర వివరాలివ్వండి

సుండుపల్లె : మండలంలో ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్‌కు వచ్చిన డీకేటీ భూముల సమగ్ర వివరాలు అందజేయాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి అధికారులకు సూచించారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని పాలిమేరపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని జంగంపల్లి సమీపంలో డీకేటీ భూములను సబ్ కలెక్టర్ రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుండుపల్లె తహసీల్దార్ దైవదీనం భూముల రికార్డులను సబ్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి భూమి వివరాలను రికార్డులలో, రైతుల వద్ద ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలు పరిశీలించాలన్నారు. భూముల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకొని సత్వరమే నివేదిక అందజేయాలన్నారు.



భూముల వివరాలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి

ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి

రైల్వేకోడూరు అర్బన్ : ప్రతిరైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్, ఈ - పంట యాప్‌లో పంట నమోదు ప్రక్రియను, రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంటలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

రాజంపేట రూరల్: రసాయన పద్ధతులతో పోల్చుకుంటే ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని పోలీలో మంగళవారం నిర్వహించిన జీఏపీ పొలంబడిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కౌలు రైతులకు కౌలు కార్డు ద్వారా బ్యాంకుల నుంచి పంట రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జి.సురేష్‌బాబు, ఏఓ జి.రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగును చేపట్టండి

ఓబులవారిపల్లె: రైతులు చిరుధాన్యాల సాగును చేపడితే కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కల్పిస్తుందని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రా నాయక్ పేర్కొన్నారు. మంగళవారం గోవిందంపల్లిలో నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుచేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అనేక పథకాలు కల్పిస్తుందన్నారు. అలాగే రైతులు పంటల మార్పిడి చేసుకుని స్థిరమైన ఆదాయం పొందాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు.

గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



పశువులకు యద పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

రామాపురం : పశువుల గర్భకోశ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కడప జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణ అధికారి రమేష్ అన్నారు. మండలంలోని చిట్లూరు గ్రామం చెనిక్యాయపల్లెలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువుల గర్భకోశ వ్యాధులు, చికిత్సల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 35 రకాల పశువులకు వచ్చే గర్భకోశ వ్యాధులు, 10 చూటీ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ యద సూదులు వినియోగించుకొని 90శాతం పేయ దూడలు పుట్టు అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లా ఉప సంచాలకులు మాలకొండయ్య మాట్లాడుతూ త్వరలో జరగబోవు గాలికుంట నివారణ టీకాలను రైతులు ఉపయోగించుకోవాల్సిందిగా తెలియజేశారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సహాయ సంచాలకులు సుధీర్‌నాథ్, బెనర్జీ, పశువైద్యాధికారి శివరామిరెడ్డి, మండల పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరం లేక వాయిదాపడిన మండల సమావేశం

సిద్దవటం : మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్టు ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. మంగళవారం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరగవలసిన సమావేశంలో ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరం లేక సభను వాయిదా వేశామని, తరువాత సమావేశం ఎప్పుడు జరపాలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, సర్పంచ్‌లు, ఈఓపీఆర్‌డీ పులిరామ్ సింగ్, ఎస్ఈబీ ఎస్ఐ బాబు, ఎంఈఓ విలియంరాజు, డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, పి.కొత్తపల్లి వైద్యురాలు డాక్టర్ రంగలక్ష్మీ, హౌసింగ్ ఏఈ చెన్నయ్య, ట్రాన్స్‌కో ఏఈ జయచంద్ర, పశువైద్యాధికారి శివశంకర్, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఉపాధి ఏపీఓ నరసింహులు, ఐసీడీఎస్ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదను సృష్టిద్దాం



వీరబల్లి: మొక్కను నాటి నీరు పోస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పుల్లంపేట: చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్‌లు, కార్యదర్శులు



పెనగలూరు: పారిశుధ్య కార్మికులకు చెత్త ఎలా వేరు చేయాలో అవగాహన కల్పిస్తున్న అధికారి

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మట్లి గ్రామ ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మల్లేశ్వరీ తెలిపారు. రెండోరోజు మంగళవారం సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఆమె సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువులను ఏ విధంగా తయారు చేసుకోవాలో అడిగి తెలుసుకున్నారు.

రామాపురం : చెత్త నుంచి సంపద కేంద్రాలను బలోపేతం చేయాలని ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ సభా భవనంలో సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల అభివృద్ధిపై సర్పంచ్‌లు కార్యదర్శులు దృష్టి పెట్టాలని, గ్రామాలలో విద్యుత్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఉషారాణి, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పుల్లంపేట : చెత్తనుంచి సంపదను సృష్టించాలని ఎంపీడీఓ రఘురాం అన్నారు. మంగళవారం పంచాయతీ సర్పంచ్‌లకు, గ్రామ సెక్రటరీలకు రెండోరోజు శిక్షణలో భాగంగా మంగళవారం గ్రామీణ ప్రాంతాలలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి వాటి నుంచి వర్మీ కాంపోస్టు తయారు చేసి తద్వారా ఆదాయం పొందాలన్నారు.

సుండుపల్లె : పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు రిఫ్రెష్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా రెండోరోజు మంగళవారం ఎంపీడీఓ రామచంద్ర ఆధ్వర్యంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం క్షేత్రస్థాయిలో పరిశీలనకు సర్పంచ్‌లు, కార్యదర్శులతోపాటు గ్రీన్ అంబాసిడర్లకు టి.సుండుపల్లె చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఏ విధంగా కంపోస్టు తయారవుతుందనే విషయాలపై అవగాహన కల్పించారు.

పెనగలూరు : సర్పంచ్‌లకు, పారిశుధ్య కార్మికులకు మంగళవారం తడి, పొడి చెత్త సేకరణపై ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ సుబ్బరాయుడు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెనగలూరు, సింగారెడ్డిపల్లి ఎస్‌డబ్ల్యూపీసీ భవనాల వద్ద పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్త ఎలా వేరు చేయాలో అవగాహన కల్పించారు.